

పెద్దకథ

# ఆకర్షణ

పెళ్ళకూరు జయప్రద

'మీరు...మీరు... నే ననుకోలేదు. మీ దగ్గరనుండి దీనిని నే నందుకోవలసి వస్తుందని' నేనిచ్చిన నా వివాహ శుభలేఖను తదేకంగా చూస్తూ గొణిగాడతను. అతని కనురెప్పల వెనక కనుపాపల చలనం స్పష్టంగా తెలుస్తోంది. నా గుండె దడదడ కొట్టుకుంది. నాకు తెలుసు ఈ క్షణాన్ని నే నెదుర్కోవలసి వుంటుందని. అందుకు సంసిద్ధురాలయ్యే వచ్చింది. తెలిసే ఇంత కఠినమైన నిర్ణయం చేసుకుంది. ఈక్షణం దాటేంతవరకే బాధ. ఆ తర్వాత ఆ క్షణాన్ని మర్చిపోతుంది. కానీ ... కానీ, ఇప్పుడతను కనురెప్పలెత్తి నల్లటి కనుపాపలతో తనవైపు సూటిగా చూస్తే భరించే దెలాగ? ఇలా ఎందుకు చేసావని అడిగితే ఏమి జవాబు చెప్పాలి?'

అతను మెల్లిగా, నిశ్చలంగా కళ్ళెత్తాడు. 'ఎంత అయస్కాంతశక్తి అతని కళ్ళలో!' నా ఇష్టానికి వ్యతిరేకంగా నా కనురెప్పలు వాలిపోయాయి. మరలా వాటిని ఎత్తడానికి సాధ్యం కాకపోయింది. అతను ఏమీ మాట్లాడలేదు. కానీ నాకు తెలుసు అతని చూపులు నన్ను వెంటాడుతున్నాయని 'భగవాన్! ఎంతసేపిలా? అతని ఆకర్షణను ఎదుర్కొనే శక్తినివ్వు నాకు!'

అతను కదిలాడు. 'హమ్మయ్య! అతను వెళ్ళిపోతాడు. తను పారిపోవచ్చు''''కానీ నేననుకున్నట్లు అతను వెళ్ళిపోలేదు. ఎదురుగావచ్చి రెండుభుజాలమీద చేతులువేసాడు. ఒళ్ళంతా తీగలా ఏదో ప్రాకింది. చప్పున గుండెల కత్తుకున్నాడు. ఒక్కక్షణం మరేదీ కన్పించలేదు. అంతా నిరామయమయింది. ఎదురుగా అతను. సర్వప్రపంచం అతనిలోనే ఇమిడిపోయింది. తనకు అలా వుంటే కొన్నిగంటలయినా బాహ్యస్మృతి కలిగేదికాదు. కానీ అతను వెంటనే నన్ను దూరంగా జరిపి అంతదూరాన నిలబెట్టి సూటిగా నాకళ్ళలోకి చూస్తూ అన్నాడు.

'ఇదే నీ నిర్ణయమైతే నేనేమంటాను గోపికా! సుఖంగా జీవించు' ఆమాట అని తొందర తొందరగా మెట్లుదిగి వెళ్ళిపోయాడతను.

నాఆలోచనాశక్తి దిగదుడుచుకపోయింది. శూన్యంగా నిల్చున్నాను. కొన్ని నిముషాలు గడిచాక చైతన్య మొచ్చింది. ఇదే మొదటిమారు ప్రభుదాసు తనను స్పర్శించడమూ, 'నువ్వూ' అని సంబోధించడమూనూ. ఈ అనుభూతిలో ఇంత మధురత వున్నపుడు తనెందుకు అంత నిర్లక్ష్యంగా దానిని కాదనుకుంది?'

హృదయం నిండా ఏదో ఆక్రమించుకుంది. ఆ 'ఏదో' తాలూకు హస్తాలు చాలా బలంగా వున్నాయి. క్రమంగా హృదయమంతా ఖాళీ అయిపోతున్నట్లనిపిస్తోంది. విద్యుత్తులాగా నీరసం నాశరీరాన్నంతా ఆక్రమించింది. కుప్పలా

కూలబడి పోయాను. చటుక్కున ఒక ఆలోచన వచ్చింది. ఈ క్షణాన అనుకుంటే ఈ పెళ్లి రద్దు చేసుకోవచ్చు, కానీ 'ఎంత అవమానం అది?' దుఃఖం ఉప్పెనలా ముంచుకొచ్చింది. ఎప్పుడూ, నవ్వించే అతని మాటలు కలతబెడుతున్నాయి ఈనాడు. ఎవరి ఒడిలోనైనా తలదాల్చుకుని గట్టిగా— ఏడవాలనిపిస్తోంది. కానీ అటువంటి స్నేహితులెవ్వరూ ఆక్షణంలో గుర్తుకు రాలేదు. అంతా కలసి ఒక్క ప్రభుదాసుగా ఎదురుగా నిల్చుంటున్నారు. 'భగవాన్!' ఒక్కపరుగున మెట్లన్నీదిగి వాకిలి చేరాను. అప్పటికే అతను వెళ్ళిపోయాడు. అతను వెళ్లిన దారివైపే చూస్తూ ఆసాయంత్రం వాకిట్లో ఎంతసేపు నిల్చున్నానో తెలియదు. అక్కవచ్చి తట్టిపిలిచింది 'ఇదేమిటి పాపా ఏడుస్తున్నావా?' ఉలిక్కిపడ్డాను. 'అతని కొఱకు ఏడుస్తున్నానా నేను!' అక్కను తప్పించుకుని గదిలోకెళ్లి భళ్ళున తలుపులు వేసుకుని పరుపుమీద వాలిపోయాను అతనికి ఉత్తరం వ్రాయాలనిపించింది. 'ప్రభూ!' ఆగిపోయింది కలం. సంతతధారగా కన్నీరు కారడం మొదలెట్టింది. ఆకాగితాన్ని గుప్పెట్లో మడచి గుండెల కదుముకుని దిండులో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాను. కొద్దిసేపటికి హృదయం తేలిక పడినట్లనిపించింది. తేలిక పడిన హృది ఆలోచనల్లోకి జారిపోయింది—

తెలుగుస్కూల్లో చదువుతున్న తమ్ముణ్ణి ఒక్కమారుగా—నాగరికత పెరిగిపోయి ఇంగ్లీషు స్కూల్లో చదివించాలనే ఊహ ఆ ఇంట్లో ప్రతి ఒక్కరికి కలిగింది. దానిఫలితంగా కృష్ణుణ్ణి కాన్వెంటులో ఒక క్లాసు తక్కువలో వేయించడం జరిగింది. అప్పటికీ వాళ్ళ స్టాండర్డ్సును అందుకో లేకపోయాడు వాడు. అందుకుగాను ప్రయివేటు చెప్పించాల్సి వచ్చింది. ఎమ్. ఏ. చదివే ఒక బీదబ్బాయి అందుకు నియమించబడ్డాడు తనెప్పుడూ అతనిని చూడలేదు కానీ కృష్ణుడి గదిలో నుండి ఒక శ్రావ్యమైన కంఠం గంభీరమైన ఉచ్చారణతో వినవచ్చేది. తను బి ఎ పాస్ అయిందిగాని, ఎవరితోనైనా ఇంగ్లీషులో మాట్లాడాలంటే కంఠంలో రాళ్ళు గలగలలాడ్తాయి. అందుకే ఒకరోజు నిర్ణయించుకుంది కృష్ణుడితోపాటు తనూ విని నేర్చుకోవాలని. ఆమాటే నాన్నగారితోచెప్తే 'ఇంతమాత్రానికే నన్నడగాలా పాపా' అన్నారాయన.

ఆరోజుకూడా రోజులాగే గంభీరమూ, శ్రావ్యమూ అయిన ఆ కంఠం కృష్ణుడి గదిలోనుండి వినిపిస్తోంది. క్రొత్త ఉత్సాహంతో, జిజ్ఞాసతో ఆగదిలో అడుగు పెట్టాను.

'నమస్తే మాస్టారూ!'

క్రొత్త కంఠస్వరానికి ఉలిక్కిపడి తలెత్తాడు.

'నమస్తే' అతని పెదవులమీద సన్నటి హాసరేఖ మెరిసింది ఆహ్వానసూచకంగా.

అంతే—

అడుగు ముందుకు వేయడమే మర్చిపోయాను. అతని కళ్లల్లో మెరుపు, పెదవులమీద చిరునవ్వు స్పృహ కోల్పోయేలా చేసాయి.

'రా అక్కా కూర్చో' ప్రక్కకు జరిగి అక్కకు చోటిచ్చాడు కృష్ణుడు తనతో అక్కకూడా చదువుకుంటుందంటే గర్వం గానూ, సంతోషంగానూవుంది వాడికి.

అడుగులో అడుగువేసుకుంటూ వచ్చి కూర్చున్నాను, తలవంచుకుని. అదేం ఖర్మమో ఎప్పుడూ గలగల మాట్లాడే తనకు మాటలే కరువయ్యాయి. కృష్ణుడు పరిచయం చేసాడు, వాడికి తెలిసిన కొద్దిపాటి సంస్కారంతోకూడిన నాగరికతతో.

'మా చిన్నక్క మాస్టారూ. గోపిక బి. ఏ.'

బలవంతంగా కళ్లెత్తింది. అతని పెదవులమీద చిరునవ్వు తాలూకు ప్రతిబింబం ఆకళ్లలో స్పష్టంగా కన్పించింది.

'నమస్తే'

తిరిగి చేతులు జోడించాను. ఆవేళ్ల కొనల వణుకును దాచుకోవడానికి వెంటనే పిడికిలి బిగించాను. తలవంచుకుని సన్నని కంఠాన అన్నాను.

'మీదగ్గర ఇంగ్లీషు నేర్చుకుందామని వచ్చాను.'

అలాగే గోపికా! తప్పకుండా రోజూ వచ్చి వినండి. నాకు వచ్చినంత వరకు మీరు నేర్చుకుందురుగాని' అతని పెదవులు విచ్చుకున్నాయి.

అతని నోటివెంట 'గోపికా!' అని విన్నపుడు ఆ పిలుపు చాలా మధురంగా వుందనిపించింది మొదటిమారుగా.

అతను కృష్ణుడికి పాఠం చెప్పడంలో మునిగిపోయాడు. తలవంచుకుని పుస్తకంలోకి చూస్తున్న అతనిని కన్నార్పకుండా చూస్తూ కూర్చున్నాను. ఆక్షణంలో అంతకంటె నేను చేయగల్గింది మరేదీ లేదనిపించింది. సర్వం మరపింప చేయగల చిరునవ్వు అతనిది. అతని కనురెప్పలు కొద్దిగా చలించాయి. గుండె వేగంగా కొట్టుకుంది. ఒళ్లంతా చమటలు పట్టాయి. అక్కడ వుంటే ఈ పంచలనానికి తట్టుకోలే ననిపించింది.

'రేపువస్తాను మాస్టారూ' ఆమాటలు పూర్తిగా అన్నానో లేదో తెలియదు. అతను ఏమన్నాడో విన్పించుకోకుండా ఒక్క పరుగున గదిలో కొచ్చి పడ్డాను.

'మాస్టారూ!' మధురంగా ఉచ్చరించాయి నా పెదవులు. ఏదో మధురానుభూతి నాశరీరాన్నంతా ఆక్రమించింది. ఇది సరిక్రొత్త అనుభూతి. కొద్దిసేపయ్యాక ఆలోచించడం మొదలెట్టాను. అతనిని చూచి తనలో ఎందుకింత కలవరం చెలరేగింది? ఇంతమంది అబ్బాయిలతో ధమాయించి మాట్లాడగలిగిన తను అతని ముందు మూగదయిపోయిందేమి? కాలేజీలో 'రవుడీపిల్ల' పేరు గడించిన తనకు ఏమిటీ భంగపాటు? ఏముందని అతనిలో అంత ప్రత్యేకత?' అతనిరూపాన్ని కళ్ళముందుకు తెచ్చుకున్నాను.

'నల్లగా, పొట్టిగా, బలంగా వున్నాడు. గుండ్రటి ముఖం...ఏముందని అతనంటే ఇంత ఆకర్షణ!...'

'ఆ మెరిసే కళ్ళు, నవ్వే పెదాలు... ఆలోచనలు ఆగిపోయా యక్కడే. క్రింద పెదవిని కొద్దిగా ముందుకువంచి అతను సన్నగా నవ్వడమే వింతగా వుంటుంది.

ఆ తర్వాత నాలుగురోజుల వరకు అతనికి ఎదురు పడలేదు. అసలు వింత ఏమంటే అతని ఎదురుగా తను వెళ్లలేదు. అతను పలకరిస్తే తప్ప తను పలకలేదు. ఒక్కొక్కప్పుడు స్నేహితురాలితో సినిమాకెళ్లాలని ఒక్కగంట ముందుగానే ప్రత్యేకంగా తయారయ్యి, స్నేహితురాలి కొఱకు ఎదురు చూస్తున్నట్టు వాకిట్లో నిల్చుని ఊహల్లోకి జారిపోయేది. కొన్ని నిముషాలు తన ప్రక్కన స్నేహితురాలికి

బదులు అతనిని ఊహించుకునేది. తీరా అతనువస్తే తుర్రున ఇంట్లోకి జారుకునేది. ఒక్కొక్కప్పుడు అతను సమయానికి వచ్చేవాడు కాదు. నిరీక్షించి నిరీక్షించి అలసిపోయేది.

కాలం గడిచేకొలదీ అతనిదగ్గర కొద్దిగా చనువయ్యింది. అతను చాలా కలుపుగోలుగా మాట్లాడేవాడు. తన స్వంత విషయాలుకూడా చెప్పేవాడు.

'రాత్రి నిద్రలేదు, ఈ రోజు త్వరగా వెళ్ళి నిద్రపోవాలి గోపికా!'

'ఎందుకని నిద్రలేదు?' సంభాషణ పొడిగించడానికి అడిగేది.

'క్లబ్‌లో డ్యాన్సువుంది నిన్న చాలా పొద్దుపోయే వరకు ఫ్లోర్ లో వుండిపోయాను'

'ఆశ్చర్యం! ఈ సాధారణమైన బుద్ధిమంతుడైన అబ్బాయి క్లబ్‌కెళ్తాడా?'

'మీకు క్లబ్‌లంటె ఇష్టమా? ఆ, నాగరికత అంటె వ్యామోహమా?'

అతను నవ్వాడు

'వ్యామోహం లేదుకాని, ఇష్టంకూడా లేకపోలేదు కాకపోతే బీడతనానికి, దానికీ లంకె కుదరదు కాబట్టి ఎవరైనా స్నేహితులు తీసుకెళ్తేనే వెళ్ళడం' తనకు సిగరెట్ కాల్చేవాళ్ళంటేనే అసహ్యం. అటువంటిది ఇతని నోటివెంట ఈ మాట విన్నప్పటికీ ఇతనంటే అసహ్యం కలగడంలేదెందుచేతనో?

ఆలోచనమధ్యలో ఒక చిన్న అనుమానం.

## ఆకర్షణ

'క్లబ్‌లో అందరూ తాగుతారటకదా! మీరూ తాగుతారా?'

అతని జవాబునిని ఉలిక్కిపడింది

'కంపెనీకోసం తాగుతాను మనశ్శాంతి కోసరం తాగే అవసరం ఇంకా రాలేదు అలాంటి అవసరమేవస్తే బహుశ మీరు అనుకునేలా తాగుతానేమో!'

ఆశ్చర్యంగా అతని కళ్ళలోకి చూచి వెంటనే అక్కడనుండి వెళ్ళిపోయింది. వెళ్ళేముందు ఒక్కక్షణం అతని పెదాల వైపు చూచింది అవి సన్నగా నవ్వుతున్నాయి

ఒకరోజు స్నేహితురాలింటికెళ్ళి తిరిగి వస్తూ రిక్షాకోసం ఎదురుచూస్తున్న సమయంలో అదే వీధిలోవున్న ప్రభుదాసు రూముకాహ్వానించాడు అప్పుడు కృష్ణుడు కూడా ప్రక్కనలేడు అంతవరకు తనతో వచ్చి మధ్యలో వాడి స్నేహితుడు కన్పిస్తే, 'అక్కా! ఇల్లు దగ్గరేకదా! నువ్వు రిక్షాలో వెళ్ళిపో నేను వీడి ఇంటికెళ్ళి ఇప్పుడే వస్తాను' అనేసి తుర్రుమన్నాడు

'రండి గోపికా నన్ను నిరాశపర్చకండి ప్లీజ్' నాపట్లవున్న ఆరాధనంతా ఆ కళ్ళల్లో కన్పిస్తోంది. కాదనలేక అతని వెంట నడిచాను కానీ అతని రూముమెట్లు ఎక్కుతున్నపుడుమాత్రం కాళ్ళు వణికాయి

'ఏదేమిటి? పరాయిపురుషుడి రూముకు ఒంటరిగా వెళ్తోంది' అక్కడేమయినా జరిగితే! అసలే అతని ఆకర్షణ తనను బలంగా కట్టిపడేస్తోంది'

వెంటనే నిర్ణయించుకుంది తను బలహీనురాలు కాకూడదని, కానీ మరలా అదే క్షణంలో కలిగిన భయంకరమైన ఊహ నన్ను ఆమెట్లమీదనే నిలబెట్టేసింది.

'అతను క్లబ్ కెళ్తాడు, డ్యాన్సు చేస్తాడు, తాగుతాడు. అటువంటివాడు మరేదోచేయడని గ్యారంటీ ఏమిటి?'

'నిలబడిపోయారేం గోపికా! నామీద నమ్మకంలేదా?'

అతని కళ్ళల్లో ఎదుట వ్యక్తిని వివశుల్నిచేసే శక్తివుంది నిశ్శబ్దంగా అతని వెంట నడిచాను

'మా రూము చూచి భయపడకండి' నవ్వుతూ ఒక 'మోడా' తెచ్చివేసాడు కూర్చోమన్నట్టు రూము చాలా చిందరవందరగా వుంది. ఒక చిన్న స్టూల్‌ను, కుర్చీని దానిమీదవున్న బట్టల్నీ, కాఫీ పౌడర్ డబ్బాను అన్నిటినీ ఆ ఇరుకు రూములో చాలా కష్టంమీద తప్పించుకుని వెళ్ళి తలుపుదగ్గరగావేసి ఫ్లాస్కులో కాఫీ గ్లాసులో ఒంపి తెచ్చిచ్చాడు

'మీరూ తీసుకోండి' అన్నాను నా భయాన్ని దాచుకోవడానికి శతధా ప్రయత్నిస్తూ. అతను నవ్వాడు

'ఉండేది ఒక కప్పే' అని ఆగి.


'నేను తాగేదానికంటే ఈరోజు మీరు తాగుతుంటే, నేను ఉపవాసమైనా సరే చాలా సంతోషంగావుంది. ఇన్నిరోజులుగా నేను తాగానుగానీ ఇంత సంతోషం— ఇంత సంతృప్తి నాకెప్పుడూ కలగలేదు' అతని కనుపాపలలో మెరుపు తలవంచుకుని కాఫీ తాగుతున్నాను తమాషా! నాకుకూడా ఆ హోటల్ కాఫీ చాలా రుచిగా వున్నట్లనిపించాయి

నా ఎదురుగా ఇంకొక మోడా తెచ్చి వేసుకుంటూ సంభాషణ మొదలెట్టాడు ప్రభుదాసు.

బి ఎ పాస్ అయి ఇంట్లో వుండిపోయారేమి? తర్వాత ప్రోగ్రామేమిటి?'

అతని ఉద్దేశాన్ని చూచాయగా గ్రహించి భయపడ్డాను

'వచ్చే సంవత్సరం సీట్‌వస్తే ఎమ్. ఎ.లో చేరుదామనుకుంటున్నాను' సంభాషణ పెళ్ళిలోకి దిగకుండా వుండడానికి రకీమని



**1968—69 లో మీ అదృష్టము**

మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలలో జరుగు



ముఖ్య సంఘటనల అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, నర్వీసులో ప్రమోషన్ (ఉద్యోగ) ప్రాప్తి, పిల్లల జననం, వివాహ సుఖ సంతోషము మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజిఆదనం ఒకసారి మా చిన తృప్తి చెందగలరు.

PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI (MAP)
P.B 86. JULLUNDUR CITY.

**తరచు మూత్రం విసర్జిస్తున్నారా!**

తరచుగా మూత్ర విసర్జన ఒక ప్రమాదకరమైన వ్యాధి. ఇది రోజు రోజుకు వ్యాధిగ్రస్తుని పై తన ప్రభావం చూపి, మృత్యుముఖానికి దారి చేస్తుంది.

ఈ వ్యాధిచే బాధపడువారు అధిక దాహము, ఆకలి, శరీరమంతా పోట్లు, శారీరక మానసిక కార్యములందు అశ్రద్ధ, దిన దినమునకు బలహీనులగుట, దురదలు, చర్మ వ్యాధులు, కాలేయ మాంద్యము, బలహీనమైన మూత్ర పిండములు, సరిగా లేని మూత్ర కోశము కలిగి వుందురు. ఈ వ్యాధిని అశ్రద్ధ చేసినయెడల కీళ్ళవాతము, చూపుమాంద్యము, నిద్రలేకుండుట, అతిసారము, రాచ కురుపులు, శారీరక మానసిక బలహీనత, అలసట, నిస్త్రాణ, నరముల బలహీనత సంభవించును.

ఈ వ్యాధితో బాధపడువారు మాకు వ్రాయ గోరడమైనది. మేము "ఉచిత వైద్య సలహా" యిచ్చి, ఈ ప్రమాదకరమైన వ్యాధినుండి ఇన్‌జక్షనులు, ఉపవాసములు లేక కఠిన అహార నియమములు లేకుండా విముక్తిపొందుటకు సహాయపడెదము.

BARRYS REMEDIES
LABORATORIES (A P W.)
10, Wellesley Square, Calcutta-16

# ఆకర్షణ

అబద్ధమాడాను.

'వెరీ గుడ్, అలాచేయండి, అన్నీ అవకాశాలున్న వాళ్ళు చదువు మధ్యలో ఆపేస్తే నాకెందుకో బాధగా వుంటుంది.'

కొద్దిగా నిరాశపడ్డమాట వాస్తవం. అతను ఏదేదో చెప్తున్నాడు. అతని మాటల్లో అతని వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది. అతని మంచితనం వ్యక్తమవుతుంది.

అతని ప్రతిమాట మధ్యా నా కనిపించేది 'ఇంత మంచివాడు ఎందుకు తాగుతాడు?' అని, ఉండబట్టలేక అడిగేసాను.

'మీరు తాగడం మానేయకూడదూ?'

'మానేయవచ్చు కానీ నా కింతవరకెవ్వరూ చెప్పలేదు మానేయమని' సన్నగా నవ్వాడతను. తను మాట్లాడలేదు మరలా అతనే అన్నాడు చిలిపిగా.

'పోనీ మీ కొఱకు మానేయనా?'

గుండె కొట్టుకోవడం మానేసింది ఒక్క క్షణం.

అతను నవ్వుతూనే వున్నాడు. అతని పెదవులమీద మెదిలిన హాసరేఖ అలా పొడిగిపోతూనే వుంటుంది కాని ఎప్పుడూ చప్పున మాయం కాదు.

'ఇకవెళ్తాను' తలవంచుకుని అన్నాను.

'రండి ఇంటిదాకా దిగబెట్టి వస్తాను'

'మీ కెందుకా శ్రమ' గొణిగాను.

'మా ఇంటికి అతిథిగా వచ్చి నన్ను సంతోషపెట్టిన మీ కొఱకు అంతమాత్రం శ్రమ తీసుకోలేనా?' అతనికళ్ళలో ఒక మెరుపు తీగమెరిసింది. ఇంటి వరకు దిగబెట్టాడు. అతనితో నడుస్తున్నపుడు అదొకరకమైన అనుభూతి. ఇంటి కొచ్చి తనగదిలో మెత్తటి పరుపుమీద వెల్లకిలా పడుకుని ఆలోచిస్తుంటే ప్రపంచ మంతా అతనితోనే నిండిపోయి నట్టనిపించింది. అతనితో కలసి జీవితాన్ని అమృత తుల్యం చేసుకోవాలనిపించింది. అలా ఆమత్తులోనే ఒరిగిపోయి నిద్రపోయాను. నిద్రలేచే సరికి కొంత వరకు ఆమత్తు వదిలిపోయి వాస్తవలోకంలో పడ్డాను. అతనిగురించి, నా జీవితాన్ని గురించీ, ఆలోచించడం మొదలెట్టాను.

అతను అంత అందంగావుండడు, పెద్ద చదువులేదు. అన్నింటికీ మించి గుణంకూడా లేదు తనకొఱకు తాగుడు మానేస్తానన్న మనిషి, తనమీద ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు, అతనికి అశాంతి కలిగినప్పుడు, మరలా మొదలుపెట్టడని ఏమిటిగ్యారంటీ. అసలే కోపిష్టి మనిషి. తమ్మణ్ణి ప్రతి చిన్నవిషయానికీ కసురుకోవడం, చెయ్యి ఎత్తడంకూడా తను చూచింది. కృష్ణుడు అటు వెళ్ళిపోయాక మెల్లిగా అనేవాడు, 'రోజురోజుకీ—కోపం ఎక్కువయిపోతోంది గోపికా. తగ్గించుకోవాలి' అని అతని బలహీనతకు గట్టిగా జవాబు చెప్పాలనే అనిపించేది కానీ అతని కళ్ళల్లోకి చూస్తూ నోరు మెదపగల సామర్థ్యమే లేకుండా పోయేది.

ఒకవేళ ఇప్పుడు ఆ ఆకర్షణలోపడి అతనిని అంగీకరించినా, తర్వాత జీవితమంతా తన క్షణికాలపు ఆవేశానికి సంజాయిషీ చెప్పుకోవలసి వస్తుంది డబ్బు అంత ముఖ్యంకాదని ఈనాడనుకోవచ్చు. కానీ చుట్టూ మనుష్యులను చూస్తుంటే అదెంత అవసరమో తెలుస్తుంది. డబ్బు వున్నందువల్ల సుఖం లేకపోవచ్చునుగాని, అది లేనందువల్ల కష్టం మాత్రంవుంది. డబ్బు లేక తెలివిగల లక్ష్మి చదువు మానేసిన విషయం తెలుసు. డబ్బులేక భర్తకు వైద్యం చేయించుకోలేక పసుపు కుంకుమలను పోగొట్టుకున్న మాలతి కథ తెలుసు తనకు. అటువంటప్పుడు, అవివేకంగా డబ్బులేనివాడిని చేసుకోవడం చాలా తొందరపాటే అవుతుందనిపించింది.

తనకు చిన్నప్పటినుండి పిల్లలంటే ఆసక్తి. అదీ ముద్దుగావుండే పిల్లలకు తల్లికావాలని కోరిక. ఎన్నోమార్లు ఊహించుకుంది, తెల్లగా బొద్దుగా, అందంగావుండే పిల్లలకు తల్లిగా తనను. భర్త అందగాడు కావాలని అంత పెద్ద కోరికేంలేదు కానీ బిడ్డలు అందంగా వుండాలి. ఇది విచిత్రమైన కోరికే.

ఆతర్వాత చదువు. తను డాక్టరు కావాలనుకుంది. కానీ తన జ్ఞానం అంత ఉన్నతికి చేరుకోలేకపోయింది. కనీసం తన భర్త అయినా డాక్టరుకావాలని తీవ్రంగా ఆకాంక్షిస్తోంది.

అన్నిటికీ మించి తనకు మంచితనం కావాలి. అతనిలో ఏ మాత్రం లోపం వున్నా

పు స్త క ము లు

5 పుస్తకముల సెట్టు రు. 5-50

(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/- పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS.
(WAT-7) Beat No. 13 Aligarh.

సేల్సుమేన్ కావలెను

నెలకు రు. 350 లేక కమిషన్‌పై స్త్రీలు/పురుషులు రెండు తెగలవారు పూర్తికాలము/విరామ కాలములో ప్రతి పట్టణం/గ్రామమునందు మా కొత్త వస్తువులు, కాస్మెటిక్స్, టెరిలిన్, సాక్సు, టైస్, ఉక్కు పాత్రలు, అల్లిక & రెడీమేడ్ ఉడుపులు విక్రయించుటకై సేల్సుమెన్ కావలెను ఉచిత షరతులకు, శాంపిల్ సెట్‌నకు వ్రాయ గోరడమైనది.

Employment Officer, (APM-44)
P. Box 1456, Delhi


3 నెలలు ఉచిత బహుమతి



స్త్రీలకు అందాన్నిచ్చే కాశ్మీర్ ఆర్ట్ చీరెలు-సరికొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను రంగులలోను యిా బుతువుకు తగినట్లు మావద్దగల వు పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 సిల్క్సు-చీరెరు. 11లు; 2 రు.20లు; 3 కి రు. 28లు; 4 రు. 36/- రెండు లేక అంతకు పైచీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్శిల్ ద్వారా పంపెదము.

ARVIND AGENCIES (APW-22)
P. B. 1408 Delhi-6.

ఏజెంట్లు కావలెను



30% కమిషన్‌మీద ప్రఖ్యాత "ఎస్కార్ట్" 3 బ్యాండ్, ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్లు విక్రయించుటకు ఏజెంట్లు కావలెను ఉచిత షరతులకు, శాంపిలు ట్రాన్సిస్టర్ కై నేడే వ్రాయండి.

JAPCO, (APWM 27)
P.O Box 1382, Delhi—6.

# ఆకర్షణ

తను భరించలేదు..అతనిని తను అర్థం చేసుకుని, అతనిలో కరిగిపోయినట్లే, అతనూ తనను అర్థంచేసుకుని తనలో ఐక్యం కావాలి ఈ అస్థిరమైన ఆకర్షణలో పడి వీటన్నిటినీ విస్మరిస్తే, ఆ ఆకర్షణ తీరిపోయాక, అతి మామూలు సంసారమై పోతుంది. క్షణకాలపు అవివేకానికి జీవితాంతం చింతించాల్సి వుంటుంది.

అందుకే గట్టిగా నిర్ణయించుకుంది, ప్రభుదాసు ఆకర్షణలో పడకూడదని. వీటన్నిటివెనకా ఒక బలమైన కారణముంది. అతని కులం, తనకులం ఒకటి కాదు తన బిడ్డలు, తలిదండ్రుల ఒకానొక బలవత్తరమైన క్షణం తాలూకు, బలహీనమైన కార్యానికి అవమానించబడాల్సిన కాలమేవస్తే తను మాత్రం ఎలా సహించగలదు?

ఈ చిత్రమైన ఆలోచనకు నాకే నవ్వొస్తోంది ఇలాటి విషయాలు తలిదండ్రులు ఆలోచించాల్సినవి. నిజానికి తన తల్లిదండ్రులు—ఒక శతాబ్దం తర్వాత పుట్టవలసిన వాళ్ళు అంత విశాలమైన భావాలు వాళ్ళవి ఒకమారు నాన్నగారు దగ్గరకు పిలిచి చెప్పారు 'చూడు పాపా! నీ వివేకం మీద మాకు పూర్తి నమ్మకముంది. నీ పెళ్లివిషయం నీకే వదిలేస్తున్నాం అది—మంచైనా చెడ్డైనా కాదనము. చెడునుకూడా మంచిగా మలచుకోవడం నీకు తెలుసు అందుకే మాకు నిశ్చింత. నీకు ఎవరైనా నచ్చితే, అతనిది మన—కులం కాకపోయినా సరే, మన అంతస్తుకు తనివాడైనా సరే, ఆ విషయం మాకు చెప్పడానికి మాత్రం సిగ్గుపడకు తల్లీ!'

ఆ క్షణంలో అనుకున్నాను, 'ఓ విశ్వప్రభూ! నన్నెంత అదృష్టవంతురాలిగా సృష్టించావు' అని కానీ ఆ సృష్టికర్తే ఒక్కొక్కమారు తమాషాలు చేస్తుంటాడు ఎవరినీ ప్రేమించని తనకు అటువంటి తలిదండ్రులు. అదే ఎవరినో గాఢంగా ప్రేమించి, అతనులేందే తనజీవితమే లేదనుకున్న భారతి తల్లిదండ్రులు, అతి సంకుచితులు'

అలా నిర్ణయించుకున్న కొంతకాలానికి అన్నయ్య ఒక డాక్టరు సంబంధంగురించి ఆ మ్మా నాన్నా వాళ్ళతో ప్రస్తావించడం విన్నాను అన్ని వివరాలు విని 'మా కిష్టమే, ఇక పాపకు నచ్చితే అంతా జరిగిపోతుంది' అన్నారు. తన దగ్గర కొచ్చి అన్నయ్య అతనిని వర్ణించి, అతని గుణగణాలను పొగిడి ఆఖరకు చెప్పాడు, 'నువ్వు అతనికి భార్య కాగలిగితే సుఖపడ్తావు చెల్లాయ్' అని

ఆరోజు సాయంత్రం, అతనిని పార్కులో కలుసుకున్నపుడు అనుకున్నాను.

'అన్నయ్య వర్ణించినట్టు, పొడవుగా, లావుగా, ఠీవిగా, తెల్లగా విశాలమైన ఛాతితో చాలా అందంగా వున్నాడు' అని. కానీ ఆ పెద్దకళ్ళలో ఏ మాత్రపు ఆకర్షణా లేదు కళ్ళజోడు వెనకాల అవి నల్లగా మూసుకుంటూ, తెరుచుకుంటూ మాత్రం కన్పించాయి సూటిగా కొనదేరిన ముక్కు దానిక్రింద ఎఱుపు నలుపు సమపాళ్ళలో కలిసిన లావుపాటి అందమైన పెదాలు కానీ ఆ పెదాలమీద వెలిసే నవ్వులో ఆకర్షణ లేదు నవ్వినపుడు నోరుపెద్దదవడం మాత్రమే తెలుస్తోంది. ప్రభుదాసు పెదవులమీద చిరునవ్వును భరించే—శక్తిలేక లజ్జాభారంతో కనురెప్పలు వాలిపోయినా, వాటి వెనక ఆ చిరునవ్వు తాలూకు నీడ కనుపాపల్లో కదలాడుతూనే వుండేది.

ఇతనితో మాట్లాడుతుంటే, తడబాటుగానీ, సిగ్గుగానీ కలగడమేలేదు. తలవంచుకోవాలనే భావనే రాలేదు. తను చెప్పిన ప్రతిమాటకూ అవునన్నాడు. తను కోరుకునే వాటన్నిటికి చిరునవ్వుతో సరేనన్నాడు నాకాక్షణంలో ఒక క్రొత్త విషయం స్ఫురించింది 'నేను అతిమంచిని కూడా భరించలేనని. ఏ స్నేహితురాలికో అయితే 'ఇంత అందమైనవాడిని కాదంటావేమి? వెంటనే ఒప్పేసుకో' అని సలహా ఇచ్చివుండేదానిని. కానీ ఇది నా స్వంతం. ఈ మనసుకు సంబంధించిన విషయం. దానికి స్పందన కావాలి. తనకు ఏదో అవుతాడనేభావంతో ఎదురుగావున్న అతనిని చూస్తున్నా, రోడ్డుమీద పోయే అందమైన మనిషిగా మాత్రమే అగుపిస్తుంటే, ఈ వెధవ మనస్సుకు సర్దిచెప్పడమెలాగ? అదేగాక అతిమంచితనమే

కాని, నన్ను శాశించి, నన్ను నడిపించగల పురుషుడిగా అన్పించడంలేదు.

చేతులు వెనక గడ్డిలో గుచ్చి వాటి మీద శరీరాన్ని వాల్చి, సూటిగా నా కళ్ల లోకి చూస్తూ, గంభీరంగా, మృదువుగా అడిగాడతను.

'మీ అభిప్రాయమేమిటి ?'

అప్పుడు కూడా తలవంచుకోవాలనిపించలేదు. ఆలోచనల ముసుగు ప్రక్కకు—తొలగించి అన్నాను.

'క్షణాల మీద నా అభిప్రాయమేమి చెప్పగలను? ఆలోచించి అన్నయ్యకు చెప్తాను.'

'అలాగే చెయ్యండి' తనిక ఆలోచించాల్సింది ఏమీ లేనట్టూ, తను ఒప్పుకుంటే పెళ్లి జరిగిపోయేట్టూ, ఒక వేళ జరగకపోయినా ఇందులో బాధ పడాల్సింది ఏమీ లేనట్టు మాట్లాడాడు. అదే తనకు నచ్చనిది. తనను మాత్రమే కావాలని కోరుకునే పురుషుడే కావాలి తనకు.

ఈనాడు ఇతనితో మాట్లాడుతుంటే మంచితనం కంటే కూడా మరేదో కావాలని అర్థమవుతోంది. కానీ ఆ ఏదో తాలూకు సమగ్రస్వరూపాన్ని తెలుసుకోడానికి భయపడ్డాను.

అతను లేచి నిల్చున్నాడు 'రండి వెళ్దాం'.

అతనితో ఇంకొద్దిసేపు అక్కడ కూర్చోవాలనిపించలేదు. అతను నన్ను ఇంట్లో దిగబెట్టి వెళ్లిన తర్వాత కూడా అతనిని చూడాలనే ఆకాంక్ష కలగలేదు. పదిరోజుల తర్వాత అన్నయ్య అడిగాడు 'ఏమిటి చెల్లాయ్! నీ అభిప్రాయమే చెప్పలేదు ?'

'ఏమని జవాబు చెప్పాలి ?'— ఈ పది రోజులుగా అదే ఆలోచిస్తోంది. పార్కు నుండి వచ్చేప్పుడు అనుకుంది. 'ఈ గాజు కళ్లు నాకొద్దు బాబోయ్.' అని.

కానీ గంటలు గడిచే కొలదీ ఆవేశం కొద్దిగా తగ్గింది. అతనిని ప్రభుదాసుతో పోల్చి చూచుకుంటే, అన్నిటిలోనూ ఇతనిదే పై చేయి. కాగా తను కోరుకున్న గుణాలన్నీ అతనిలో వున్నాయి. ఒక్క ఆకర్షణ తప్పించి కాదన దగ్గదేదీ — కన్పించలేదు అదైనా తను విమర్శనా దృష్టితో చూడబట్టే తెలియలేదు అతని భర్యగా తను సుఖపడుతుంది.' ఆ నిర్ణయం చేసుకుని ఆ రాత్రి నిద్రపోయాను. తెలతెలవారుతుండగా, మసక వెల్తురులో మెలుకువ వచ్చింది. 'హృదయం నిండుకున్నట్లు, గట్టిగా తనివితీరా ఏడ్చేస్తే బాగుణ్ణున్నట్లు' అనిపించింది. ఆ క్షణంలోనే ప్రభుదాసు గుర్తొచ్చాడు. అతనిని పోగొట్టుకో బోతున్నందుకు హృదయం చేసే ఆక్రందన అది. ఈ పదిరోజుల్లో ప్రభుదాసు గుర్తురాని క్షణం లేదు. 'పార్కులో గంభీరంగా కూర్చున్న ఆ అందమైన డాక్టరు ఎందుకు గుర్తుకు రారు!' అని ఆశ్చర్యపోయేది. మనసు ఊగిసలాడి హృదయాన్ని పిప్పి చేస్తోంది. 'ప్రియమైన ప్రభుదాసును పోగొట్టుకో బోతోంది' అనుకున్నపుడు 'అసలు—పెళ్లి చేసుకోకపోతేనేమి ?' అని కూడా అనుకుంది. ఆ నిర్ణయం కూడా ఈ మధ్య కాలంలో జరిగిపోయింది. పూర్తిగా స్థిమితపడి, ఇన్ని రోజులకు ఆలోచించడం మొదలెట్టింది. అతనిని ఇంత ఎత్తులో పెట్టాలని సర్వప్రయత్నాలూ చేసింది. అతని గురించి తలచుకుని మధురస్మృతులను తెప్పించుకోవాలని తపనపడింది. అతనిని ఒక పూజ్యస్థానంలో అమర్చాలనే నా ప్రయత్నం ఇంకా పూర్తి గాకుండానే అన్నయ్య అభిప్రాయమడిగాడు.


'అదేమి చెల్లాయ్! దీనికింత ఆలోచన. అతను నాకు ప్రాణస్నేహితుడేమీ కాదు నువ్వు బెట్టు చెయ్యక్కరలేదు నా ముందు'

'ఇందులో బెట్టు చెయ్యాల్సింది గానీ మొహమాట పడవల్సింది కానీ ఏమీ లేదన్నయ్యా'

'అయితే నీ ఇష్టం చెప్పు ?'

'ఇందులో ఇష్టం ప్రసక్తి లేదన్నయ్యా. ఈ ఇంటి అల్లుడికి కావలసిన అర్హతలన్నీ అతనిలో వున్నాయి. ఇంతకీ ఎంతకి బేరం చేసారేమిటి డాక్టరుగారిని ?' నవ్వు వెనకాతల నా మనస్సును దాచుకోవడానికి వ్యర్థ ప్రయత్నం చేసాను. 'ఛ. ఛ. అతను అసలు కట్నం ఏ రూపంలోనూ తీసుకోనన్నాడు చెల్లాయ్. చూస్తే నీ కిష్టం లేనట్లుంది. మనస్ఫూర్తిగా నువ్వు ఒప్పుకోందే ఈ పెళ్లి జరగదు. ఇతను కాకపోతే ఇంకొకరు. ప్రపంచమేమీ గొడ్డుపోలేదు' అతని హృదయ వైశాల్యానికి నా కళ్లు ఆర్ద్రమయ్యాయి. ఆ తడికళ్లలో అతనిపట్ల ఆరాధన ఆ ఆరాధలో తడిసిన మనస్సుతో ఆ సుందరమూ, మంచితనమూ కలిసిన ఆ విగ్రహాన్ని భర్తగా అంగీకరించాను. అందులో ఇంకొక తమాషా కూడా వుంది. అన్నయ్య 'ప్రపంచం గొడ్డుపోలేదు' అనగానే ఎందుకో 'ఇతనినే చేసుకోవాలి'నే పట్టుదల కలిగింది. బ్రహ్మ ఏ మత్తులో వుండి, ఈ స్త్రీ హృదయాన్ని తయారు చేశాడోగాని!

ఆలోచనల నుండి, పూర్వ స్మృతుల నుండి వాస్తవానికొచ్చాను. నా కంటూ ఇంకేమీ మిగలలేదనిపిస్తోంది. అంతా



లౌన్యంగా వుంది. నాలో చెలరేగిన సంఘర్షణ తాలూకు నీడ కూడా ఎవ్వరికి తెలియదు. చాలా సంతోషంగా, తన చెల్లెలికి యోగ్యుడిని, ఉన్నతుడిని సంపాదించగలిగాననే సంతోషంతో, గర్వంతో అన్నయ్య ముఖం వెలిగిపోతోంది. పెళ్ళి పనులు చకచక జరిగిపోతున్నాయి. ప్రతి అడుగులోనూ ప్రభుదాసు నీడ వెంటాడుతోంది. ఆ నీడ నన్ను వీడక ముందే పెళ్ళి జరిగిపోయింది.

ఆరోజు నన్ను పెళ్ళికూతురిని చేసి ముత్తయిదువులంతా వెళ్ళిపొయ్యాకవచ్చాడు ప్రభుదాసు. గుండె దడదడలాడింది. ఈ పవిత్రమైన క్షణంలోకూడా ఆ పరాయి పురుషుడివైపు సూటిగా చూచి, అతి మామూలుగా మాట్లాడలేక పోయాను. 'రండి' అనిమాత్రం అనగలగాను అలాగే 'రండి' అని హృదయంలో కాస్త చోటిచ్చుంటే, ఈ సంఘర్షణకు తావులేకపోయేది. అతను నేరుగావచ్చి నా కెదురుగా నిల్చున్నాడు. నేను భయపడ్డాను 'అపవిత్రురాలు, మోసగత్తె'లాటి ఏ పదాలతో అయితే నా మనస్సు నన్ను భయపెడ్తోందో ఆపదాలే అతని నోటివెంట వినాల్సివస్తుందనుకున్నాను. స్త్రీపురుషులమధ్య కలిగే ప్రేమను, ఎవరిముందైనా దాచవచ్చు కాని వాళ్ళల్లో వాళ్ళు దాచుకోలేరు. పైకి చెప్పకపోయినా, సిగ్గుతో భారంగా వాలిపోయే తన కళ్ళూ, ఎర్రబారినా తన ముఖమూ అతనికేనాడో నాభావాన్ని వ్యక్తపరిచేవుంటాయి. ఆ విషయం అతను

# ఆకర్షణ

సూటిగా అడిగితే ఏమని జవాబు చెప్పాలి? కానీ నేను ఊహించినట్టు జరగలేదు కొన్నినిముషాల మౌనం తర్వాత చిన్నగా నిట్టూర్చి అతిసన్నని స్వరంతో అన్నాడు

'ఈ శుభసమయంలో కానుకగా నేను మీకే మివ్వగలను గోపికా. బీదవాడిని.' అని ఆగి కాతరకంఠంతో అన్నాడు,

'ఈ ఇంట్లో అడుగుబెట్టి, మిమ్మల్ని చూచిన క్షణంలో నాకు మిగిలిన విలువైన వస్తువునుకూడా పోగొట్టుకుని మరీ బీదవాడనయ్యాను'

నా నరనరాలూ బాధతో మెలికలు తిరిగాయి ఏదో చెప్పాలనే తపన నన్ను మాట్లాడించేలా చేసింది.

'ఏదైనా సరే...ఇవ్వండి... మీగుర్తుగా' అతను నవ్వాడు సన్నగా.

'ఇవ్వాలనుకున్నది ముందుగానే ఇచ్చాను మీరు దానిని కాదని వేరే అడిగితే··· చెప్పానుగా నేను చాలా బీదవాడినని.'

నేను మాట్లాడలేదు. ఏమి మిగిలిందని మాట్లాడడానికి!

'నన్ను బీదవాడినిచేసి మీరు గొప్పవారవుతున్నారు గోపికా 'జోక్'వేసినంత హాయిగా నవ్వాడు ఆ హాయి వెనక ఏదో అపశ్రుతి వుంది. అది నిస్తేజమైన నా హృదయాన్ని చైతన్యం చేసింది.నాకంట్లో నుండి రెండు కన్నీటిబొట్లు రాలిపడ్డాయి అతను నవ్వు ఆపేసి దీనంగా చూస్తూ అన్నాడు.

'క్షమించండి గోపికా, ఈ సమయంలో మూర్ఖంగా మీమనస్సు కష్టపెట్టాను. నేను మీదగ్గరనుండి ఏదీ పొందలేకపోయినా, నేను దక్కించుకున్న సంతోషం...అది తాత్కాలికమైనా సరే—మీకు చాలా ఋణపడివున్నాను. కన్నీళ్ళు తుడుచుకోండి. నాకొఱకు మీ విలువైన కన్నీళ్ళు వ్యర్థం చెయ్యొద్దు.'

నా చంపలమీద కన్నీళ్ళుధారకట్టాయి.

'అదేమిటి...వద్దు వద్దు. ఉహుఁ ఈ రోజు మీరు ఏడవకూడదు...నావల్ల......నావల్ల' అతను తడబడ్డాడు. ఎవరైనా చూస్తారని బలవంతంగా నా కన్నీళ్ళకు ఆనకట్ట వేసాను. కళ్ళల్లో నీళ్ళనయితే ఆపేసానుగానీ, అవన్నీ గుండెల్లోచేరి బాధపెడుతున్నాయి!

'గోపికా!' తలెత్తాను. అతని కళ్ళల్లో నీటి పొరవుంది. ఉలిక్కిపడ్డాను.

'వెళ్ళొస్తాను' చెమ్మగిలిన కళ్ళతో సెలవు తీసుకొని గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు

అప్పుడే అక్కడకొచ్చిన పెద్దక్క నా చంపమీద కన్నీటిచారలు చూచి—హడావిడి చేసింది.

'అదేమిటి పాపా! ఏడుస్తున్నావా?' క్కచెయ్యి తలమీదపడగానే కన్నీటికుండ బద్దలయింది. ఆమె ఒళ్ళోచేరి వెక్కి వెక్కి ఏడ్చి కొద్దిగా భారం దించుకున్నాను.

'పాపా! ఏమైందమ్మా!' కంగారుగా కుదుపుతూ అడిగింది అక్క.


'నాకసలు ఇప్పుడు పెళ్ళిచేసుకోవాలని కోరిక లేదక్కా.'

'పిచ్చిపిల్లా! ఇంతేనా? ఈరోజు గడవనీ రేపు మా తలపులే వుండవు నీకు. మమ్మల్నందరినీ వదిలి వెళ్ళిపోతున్నావనే బాధలో ఆనందం తెలియడంలేదు. ఆ తర్వాత అతనే నీకు సర్వస్వం అయిపోతాడు.'

అక్క వెళ్ళిపోయాక ఆమె చెప్పింది నిజమని గుడ్డిగా నమ్మడానికి సర్వవిధాలా ప్రయత్నించాను.

ఏ అనుభూతీ, దాచుకోతగ్గ ఏ మధుర స్మృతీ లేకుండానే పెళ్ళి జరిగిపోయింది వైభవంగా.

**(ముగింపు పైవారం)**



# పెద్దకథ




(గత సంచిక తరువాయి)

అతను నవ్వుతుంటే, అతను తనవైపు చూస్తుంటే, ఎందుకో చిరాగ్గా కోపంగా వుంది. ఇతని వల్లనే ప్రభుదాసును పోగొట్టుకున్నాననిపిస్తుంది. చాలా చిత్రమైన నింద అది. ఆ విషయం నా మనసుకీ తెలుసు. ఆరోజు మొదటి మారుగా అతను నన్ను దగ్గరకు తీసుకున్నపుడు ఏ అనుభూతీ కలగలేదు. చిన్నప్పుడు, ప్రక్కింటి మురళితో, మాధవితో ఆడుకున్నట్లే వుంది. ఆ రోజు వివాహ శుభలేఖ ఇవ్వడానికి వెళ్ళినపుడు...ప్రభుదాసు స్పర్శలో ఎంత మాధుర్యం వుంది! సర్వం మరచి పోయిందప్పుడు. అలా ... అలా వుండాలి. ఎవరో ఛళ్ళున కొరడాతో కొట్టినట్లయింది. 'భర్త కౌగిలిలో ఏమిటీ దౌర్భాగ్యపు ఆలోచనలు?' నన్ను నేను తిట్టుకుని అతని ఛాతిమీద దిండు మీద పడుకున్నంత హాయిగా పడుకుని అతను చెప్పేవి వింటున్నాను. అతను వున్నట్టుండి పిలిచాడు. 'గోపికా?'

'ఆ'

'నీకీ పేరు ఎవరు పెట్టారు?' నవ్వుతూ అడిగాడు.

'అమ్మ. ఆమె కృష్ణ భక్తురాలు.' ముభావంగా చెప్పి భర్త సమక్షంలో కూడా అమ్మ స్మృతులలోకి జారిపోయాను.

నిజానికి ఆమెకు అతి సౌందర్యవంతుడయిన వంశీమోహనుడంటె భక్తి కంటె ఆరాధన ఎక్కువ. ఆమె ప్రకృతి ఆస్వాదకురాలు. కృష్ణుడు, రాధ, గోపికలు కూడా ప్రకృతిలో భాగాలే అంటుంది. మురళీకృష్ణుణ్ణి ఆమె ఆరాధించే వైనం నాన్నగారికి కూడా తెలుసు. ఎప్పుడైనా వేకువఝామున్నే మెలుకువ వస్తే భార్యతోపాటు పూజ గదిలోకి వచ్చి, 'ఈ రోజు నా సవతి మొగుణ్ణి నేనూ పూజిస్తాను యశోదా' అంటుంటారు హాస్యంగా, ఆమె తన పిల్లలందరికీ కృష్ణుడివి, అతని ఇష్టాల పేర్లు పెట్టింది. పెద్దక్కపేరు మాధవి. రెండో అక్కపేరు రాధిక, మూడో అక్కపేరు బృంద, అన్నయ్య పేరు మురళి, తమ్ముడిపేరు కృష్ణ. తనకే ఏ పేరూ మిగలక గోపిక అని పెట్టింది.

'గోపిక ఏం పేరు? రాధా! అని పిలుస్తాను' అతను నవ్వుతూ అన్నాడు. అతని కళ్ళల్లోకి చూచాను. అవి కూడా నవ్వుతాయేమోనని. కానీ ఆ గాజు కళ్ళు వెలవెల పోతున్నాయి. ఆ గాజు కళ్ళ దోషానికి ఆ అమాయకుడికి శిక్ష విధించాలనుకున్నాను. కోపంగా అన్నాను.

'గోపిక గోపికే, రాధ రాధే! గోపికా, రాధా కృష్ణుడికి ఒకటే ఎలా అవుతారు?'

అతను ఉడుక్కోలేదు. ఇంకా నవ్వుతూనే అన్నాడు.

'కానీ ఈ మాధవుడికి రాధా గోపికా అంతా నువ్వే'.

అతని నోటివెంట విన్న రాధ గోపిక శబ్దాలలో ఏ మధురత్వమూ గోచరించలేదు. ఈ ఇంట అడుగుపెట్టిన ప్రభుదాసు 'గోపికా!' అని పిలిచినపుడు ప్రతి అణువూ ఎలా స్పందించిందనీ!

అతని ఛాతి ముళ్ళ పాన్పులా అన్పించింది. మెల్లగా వచ్చి అటు తిరిగి పడుకున్నాను. అతనేమీ అనలేదు.

* * *

మర్నాడు సాయంత్రం ప్రభుదాసు కృష్ణుడికి పాఠాలు చెప్పడానికి మామూలుగా వచ్చాడు. తన పెళ్ళి కాకముందు మధురమైన ఊహాలలో తేలిపోతూ అతనికి ఎలా ఎదురుపడాలని ఊహించుకుందో అలాగే ఎదురైంది. కానీ ఈ కలయికలో ఆ అనుభూతి లేదు. ఏదో వెలితివుంది. అతను సన్నగా నవ్వి, గబగబ కృష్ణుడి గదిలోకి వెళ్ళి పోయాడు. ఆ నవ్వు స్పృహ కోల్పోయేలా చేసింది. తీరా స్మృతి వచ్చాక, తన దురదృష్టానికి కారకుడైన భర్తమీద కోపం పెంచుకుంది. ఆ నిర్దోషిని శిక్షించ సాగింది. అనురాగ పూరితమైన అతని కౌగిలినుండి బలవంతంగా తప్పించుకుని ముఖం చేతులలో కప్పుకుని కూర్చున్నాను.

'ఇతనివల్లే...ఇతనివల్లే, తను సౌభాగ్యాన్ని కోల్పోయింది. తను అటూ, ఇటూ

ఊగిసలాడేప్పుడు బలవంతంగా తన జీవితంలోకి ప్రవేశించాడు'

'ఇతనువద్దు నాకు. ఈ పాలరాతి మహాశిల్పం తన కక్కరలేదు. సజీవమైన నవ్వు కావాలి. నాకు కావలసింది విశాలమైన 'గాజుకళ్ళు కాదు...భగవాన్! నేను పొరపడ్డాను. ఈ మంచితనం ఒక్కటే చాలదు నాకు. కొస్త అనుభూతి కావాలి. కొస్త చాలు' కళ్ళు కోపంతోనూ, రోషావేశాలతోనూ ఎర్రబారాయి. ఆవేశంతో శరీరం వణకసాగింది. అతను దగ్గరగావచ్చి లాలనగా అడిగాడు.

'ఏమైంది నీకు?'

'మీ కెందుకు నాకేమయితే' ఉలిక్కిపడ్డా డతను.

'గోపికా!' రెండు చేతులతో పొదివి పట్టి లేవదీయబోయాడు.

'క్షమించండి. నన్ను కొన్నిరోజులు సర్దుకోనివ్వండి. మీ రంటే నాకేభావమూ కలగడం లేదిప్పుడు.' చటుక్కున వదిలేసి గిరుక్కున వెనక్కుతిరిగి తలుపు తీసుకుని వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళిపోయిన దిక్కే చూస్తూ అనుకున్నాను. 'తొందర పడ్డాను' అని.

'మగవాడికి ఎంత అవమానం అది!... ఏం చేయగల దిప్పుడు'

భవిష్యత్తును అతి భయంకరమైన ఊహలో వదిలపరుస్తున్న నేను తలుపు చప్పుడవడంతో తృళ్ళిపడ్డాను.

'పాపా! అతనలా వెళ్ళిపోయాడేమమ్మా' ఆ మాతృమూర్తి ముందు మొదటిమారుగా అబద్ధమాడాను.

'ఒక పేషంటుకు వస్తానని మాటిచ్చారటమ్మా...ఇప్పుడే వస్తానని వెళ్ళారు.'

'అహ...సరే...సరే' ఆమె వెళ్ళిపోయింది.

కూతురి అబద్ధాన్ని ఆమె పూర్తిగా నమ్మింది. ఆమె కంతటివిశ్వాసం కూతురి మీద.

మర్నాటికి అతను మామూలు మనిషిలా అయ్యాడు. ఏమీ జరగనట్టే ప్రవర్తించేవాడు. అదే తనకు నచ్చనిది. అంతమాత్రం పౌరుషం లేదేమి? అతనిలో రక్తం ప్రవహించడంలేదా?

రోజులు గడిచేకొంది అతనంటె ఏదో వాత్సల్యం, ఆప్యాయత, అనురాగం కలగసాగినా, వాటన్నింటి వెనకా బలవత్తరమైన శూన్యమేదో తనను చుట్టుముట్టి నిలవనీకుండా చేస్తోంది.

పేషంట్ల కష్టాలను తనవిగా తీసుకుని అతను అశాంతితో సతమత మవుతుంటే, ఓదార్చేది. తలనొప్పివస్తే అమృతాంజనం రాసేది. వేళకు కొసరి కొసరి వడ్డించేది. అతని బట్టలన్నీ స్వయంగా దగ్గరుండి ఉతికించి సర్ది పెట్టేది. వేళకన్నీ అమర్చి పెట్టేది. ఈ పనులన్నీ—మనస్ఫూర్తిగా చేసేది. కాని అతనిని భర్తగా ఆలోచించాల్సి వచ్చినపుడు, ప్రభుదాసు స్పర్శతో ఇతని స్పర్శను పోల్చవలసివచ్చినపుడు అశాంతితో గిలగిలలాడిపోయేది. ఎక్కడో ఒకమూల ప్రభుదాసును పొందలేకపోయాననే ఆలోచన ఒక్కచోట స్థిరంగా నిలవనీకుండా చేస్తోంది. అతని చిరునవ్వు, కళ్ళలో మెరుపు, పెళ్ళి అని తెలిసి అతనుపడ్డ ఆవేదన, పెళ్ళినాటి అతనికళ్ళల్లో నీళ్ళు నన్ను నరకద్వారాల సమీపానికి తీసుకెళ్ళి వెనక్కు నెట్టేవి.

ఇదికాదు. ఇదికాదు తను కోరుకుంది. ఈ సేవలన్నీ తను పుట్టింట్లో నాన్నగారికీ చేసింది తమ్ముడికీ, అన్నలకీ చేసింది. ఇందులో క్రొత్తేముంది? ప్రత్యేకతేముంది? వీటన్నిటికీ భిన్నంగా తనను వేరే లోకాలలో సంచరింపజేయగల అనుభూతిని పొందగలిగాలి. ఏ అనుభూతినీ మిగుల్చుకోలేని ఈ సేవలలో అర్థమేముంది?'

ఒకరోజు సంధ్య, నిశికాంతతో చేతులు కలిపి ఆహ్వానించే క్షణంలో బలమైన ఊహల తాలూకు రెండు హస్తాలు నన్ను బిగువుగా బంధించి, తప్పించుకోవడానికి వ్యవధిలేకుండా చేసాయి. పొందలేని అనుభూతి తాలూకు మధురమైన ఊహల ఆకర్షణనుండి బయటపడడం నావల్ల కాకపోయింది. నిజానికి తప్పించుకోవాలని కూడా అన్పించలేదు.

ఒకవైపు భర్తనుండిపొందే అశాంతి, మరొకప్రక్క ప్రభుదాసు ఊహలలో కలిగే అనుభూతి తనను వివేకహీనను చేసేసాయి. పోగొట్టుకున్నదానిని పొందాలనే ఆరాటంలో పరుగు తీసానేకాని దాని ఫలితం ఇవ్వబోయే అశాంతినిగురించి ఆలోచించలేదు.

అసంతృప్తి అణువణువునా ప్రాకిపోయి విరక్తి నా శరీరాన్ని ముంచెత్తే సమయంలో, ఒకేఒక్క ఆలోచన ఆశాకిరణంలా అగుపించింది. అంతకంటె ఇందులోనుండి బయటపడే మార్గం కన్పించలేదు.

'గోపికా. మీరా ... ఇంత రాత్రప్పుడు ఒంటరిగా...ఆయనను తీసుక రావలసింది'

అతను తడబడ్డాడు.

'నేనేమంత పిరికిదానిని కాదులే'ఇక్కడ భర్త ప్రసక్తి తేవడంతో కొస్త ఘాటుగానే జవాబిచ్చాను.

అతను నవ్వాడు.

'మీరు కోపగించుకోకపోతే ఒక్కమాట గోపికా. మీరు మీ జీవితసమస్య గురించే పిరికిగా ఆలోచించారు. ఇప్పుడు క్రొత్తగా మీరు పిరికివారు కాదు అంటె నే నెలా నమ్మడం?'

'అంటే మీ ఉద్దేశం?'

'మీరు దేనిని కోరుతున్నారో దానిని తెలుసుకోవడానికి భయపడ్డారు'

అసలే విసిగి వేసారి పోయున్నాను. దాంతో ప్రభుదాసు మాటల్లోని వేదాంతం నన్ను రెచ్చగొట్టింది.

'అయితే ఆనాడే నా కెందుకు తెలియజెప్పలేదు?'

'నాకా అవకాశం ఇవ్వలేదు మీరు' సన్నగా గొణిగా డతను.

'నన్ను దోషిగామాత్రం నిలబెట్టకండి గోపికా!' అతనికంఠం ఆర్ద్రమయింది. అతని చూపులలో అనంతమైన భావాలు.

'లేదు లేదు. ఈ దోషంలో మీకు భాగం పంచను. దోషిని నేను. శిక్ష నేనే అనుభవించాలి.' అతను మాట్లాడలేదు. ఎప్పటిలాగే ఆరాధనా పూర్వకంగా చూస్తున్నాడు. ఆ కనుపాపల్లో క్రొత్తగా ఏదో పూజ్యభావం కూడా వుంది. అతని చూపులను ఎదుర్కొనే శక్తి ఈ నాటికీ నాకు లేదు. తలవంచుకుని వణికే కంఠంతో అన్నాను.

'నన్ను ఎక్కడికైనా తీసుకపో ప్రభూ'.

'ఎక్కడికి?'

'ఎక్కడికైనా సరే ... ప్రశాంతమైన చోటికి.'

'ప్రశాంతత—' అతని పెదాలు గొణిగాయి' అది మనస్సులో కాక మరెక్కడుంటుంది?'

'ఊహూఁ... నాకు సాధ్యం కావడంలేదు. ఇన్ని రోజులు వేచి చూసాను. ఇక ఓపిక లేదు. ప్లీజ్... కాదనకు' అతను ఐదు నిముషాల మౌనం తర్వాత అన్నాడు, 'సరే. మీ ఇష్టం.'

'అయితే ఇప్పుడే వస్తాను.'

ఇంటికి వచ్చేసరికి గోడనానుకుని వెన్నెల్లోకి చూస్తున్నారాయన. వెన్నెల్లో తడిసిన పాలరాతి శిల్పంలా మెరుస్తోంది, ఆ మూర్తి స్వరూపం.

నా పాదాల చప్పుడుకి ఇటు తిరిగాడు. 'రా, గోపికా!'

'నేను వెళ్తున్నాను' ఉపోద్ఘాతం లేకుండా చెప్పాను.

'ఎప్పుడు?' అతని కంఠంలో ఎటువంటి వికారమూ లేదు.

'ఇప్పుడే' అతను అతి మామూలుగా విన్నాడు. ఈ మనిషికి తన భార్య ఎక్కడికి వెళ్ళేది తెలుసుకోవాలనే ఆసక్తి కూడా లేదా?' ఉండబట్టలేక అడిగేసాను. అతను సన్నగా నవ్వి అన్నాడు.

'నువ్వు ఎక్కడికి వెళ్ళినా తిరిగి నా దగ్గరికు వస్తావు.'

'ఏమిటి గ్యారంటీ?'

'నా నమ్మకం' అతని నమ్మకానికి విస్తుపోయాను.

# ఆకర్షణ

'పోనీ ఎక్కడికి వెళ్తున్నాననయినా కుతూహలం లేదా మీకు.' అతని నమ్మకంలో నా పౌరుషం తగ్గిపోసాగింది.

'ఎందుకులేదు?? కానీ అడిగితే నువ్వు బాధపడ్తావు ... నువ్వు సర్దుకునేవరకూ నేను వేచివుండగలను. అది ఎంత కాలమైనాసరే' చాలా దృఢంగా చెప్పాడు.

ఆ మంచితనంతో విసిగిపోయి రెచ్చిపోయాను.

'ఇంతే మీరు నన్నర్థం చేసుకుంది. ఈనాడేకాదు ఏనాటికీ మీరు అర్థంచేసుకోలేరు. ఆ సమయంకూడా మించిపోయింది.'

అతను ఆశ్చర్యాన్నుండి తేరుకోకముందే అక్కడనుండి వచ్చేసి, ఆగడప దాటేసాను.

ప్రభుదాసు రూము దగ్గరపడే కొలదీ నా మనస్సు పదేపదే హెచ్చరించ సాగింది.

పెళ్ళయిన మరునిముషమే స్త్రీకి మాతృత్వం లభిస్తుంది. శిశువుకు తల్లి కాకముందే భర్తకు తల్లి అవుతుంది. ఒక్కక్షణం, నాఒడిలోవున్న భర్తను ఊహించుకున్నాను. ఎంత పసివాడు! నాలో ఎంత నమ్మకం!! రేపీవార్త విని 'నాగోపిక ఇలాచేయదు' అని తలబద్దలు కొట్టుకుంటాడుకాబోలు.

ఎంత వద్దనుకున్నా అతనికళ్ళల్లోని ఆప్యాయత, అనురాగం కొట్టవచ్చినట్లు కన్పించాయి. పురుషుడు స్త్రీని అంత గాఢంగా ప్రేమిస్తే ఆమెకూడా అతనిని ప్రేమించకుండా వుండలేదు. అది ఏ రకం ప్రేమయినాసరే. కానీ ఆవిషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి నేను చాలా ప్రయత్నించాను. ఈక్షణం ఎంత బలమైనదోగాని అన్నీ సినిమారీలులా కళ్ళముందు కన్పిస్తున్నాయి. తనకు తలనొప్పివస్తే అతని గాజుకళ్ళలోబాధ, తను అశాంతిగా 'ఫీల్' అయితే అతనిపెదవులు గొణిగేవి నిస్సహాయంగా. తను అతనికి సేవలుచేస్తున్నపుడు అతని, కనుపాపల్లో కృతజ్ఞత ఎప్పుడైనా, అతనితో సరదాగా మాట్లాడితే ముఖం నిండా ఆనందం. ఎలా మరచిపోయింది ఇన్నాళ్ళు?కానీ...కానీ ... ఈ వయస్సులో, కాసింతకరుణ, కృతజ్ఞత చాలా? జీవితమంతా అయిపోయినట్లూ, ఆఖరి దశలో భార్యాభర్తలు ఒకరినొకరు కష్టాలలోనూ, విరక్తిలోనూ బ్రతికేసినట్లు బ్రతికేయడమేనా? వార్ధక్యంలో వెనక్కు తిరిగి ఆలోచించుకుని, అనుభూతి పొందడానికి కాసిన్ని మధుర స్మృతులనుకూడా మిగుల్చుకోకుండా, ఈ జీవితాన్ని నిద్రపుచ్చేయడమేనా!

అహఁ పాపపుణ్యాలంటూ తనకు తానే జోలపాట పాడుకుని కలత నిద్రపోయే కంటే జీవితాన్ని అనుభవించనీ. ఆ తర్వాత మితిలేని మధురానందంలో జీవితాన్ని సమాప్తం చేసుకోనీ.


సడన్ బ్రేక్‌తో రిక్షా ఆగింది.

'ఏమైంది?' ఆతృతగా ముందుకు వంగాను.

రిక్షాకడ్డంగా ఒక ఇరవైఐదు సంవత్సరాల స్త్రీ. ఏడు సంవత్సరాల కుర్రాడు పెనగులాడుకుంటున్నారు. మొత్తానికి దారి కడ్డంగా గెంతులేస్తున్న వాడిని ప్రక్కకు లాగిందామె.

'ఏమిటమ్మా!' రిక్షావాడు విసుక్కున్నాడు.

'ఏమనుకోకు తాతా! ఈడు పిచ్చెదవ ఏటీ తెల్దు' కొడుకు వైపు ప్రీతిగా చూస్తూ అంది. విసురుగా వచ్చిన గాలికి రిక్షాలైట్ ఆరిపోయింది. దానిని వెలిగించడంలో మునిగి పోయాడు తాత. ఆమెను



దగ్గరకు పిలిచాను. చామన ఛాయ ముఖం. నల్లటి కళ్ళలో మెరపు, ఏదో కళ వుంది. ఆ ముఖంలో వికారుడైన పిల్లవాడిని భుజం మీద బలవంతంగా ఆనుచుకుంటూ వచ్చింది.

'ఏమైంది?' అడిగాను మరలా

'ఈడు నాకు బగమంతుడిచ్చిన వరం తల్లీ. ఎనక జనమలో ఏం పాపం చేసుకున్నానో, నా బిడ్డ నొసట పిచ్చితనం రాసి నన్ను సిచ్చిత్తున్నాడు. ఇంటికాడ మంచి నిద్రలో లేచి పారిపోయొస్తే వెంట లగెత్తుకొచ్చాను,'

'ఏమి ఆకర్షణ వుందని ఆ కొడుకు మీద ఆ తల్లికా మమకారం!'

'ఇంత రాత్రివేళ మీ వారు లేరా?' కుతూహలం ఆపుకోలేక అడిగాను.

'ఆడు నిద్దరోతున్నాడు తల్లీ. కాయ కష్టం చేసొచ్చి తొంగున్నాడు, లేపడమెందుకని నేనే లగొచ్చాను.'

ఆమె కళ్ళలో సిగ్గుతెరల వెనకాతల కనపడకుండా కష్టపడే భర్తమీద సానుభూతి.

ఇంతలో ఆమెభర్త పరుగెట్టుకుంటూ దానే వచ్చాడు. నల్లగా, బండగా వున్నాడు. అతని ముఖంలో ఒకరకమైన క్రూరత్వముంది.

'ఎం దుకు లేసావు మావా ?' ఆమె కంఠలో వ్యధ. 'క్రూరత్వం నింపుకున్న, ఆ కళ్ళలో ఏమి ఆకర్షణ వుందని ఆమె అతనితో జీవితాన్ని బంధించుకుంది ?'

# ఆకర్షణ

'సాల్లే. ఆడకూతురివి. ఇంత రాత్రేళ బుద్ధుంగి ?' అంటూ భార్యను కసురుకున్నాడు వాడు. ఆమె నవ్వుతూ అతని వెంట నడచి వెళ్ళింది. ఆ సంఘటన నా మత్తును పూర్తిగా వదిలించి వేసింది.

ఆ కటిక చీకటిలో, వాళ్ళ తాలూకు కనపడని నీడల్లో మొదటి మారుగా నా భర్తను తలచుకుని హృదయం స్పందించింది. అతనిమీద అనురాగం ఉప్పెనలా పొంగింది. నా ఆలోచనల ప్రమేయం లేకుండా నా నరనరాన్నీ అతని స్వరూపం ఆక్రమించింది. అతనిని నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నట్టు స్పష్టమయ్యింది.

ఈ మార్పు పాపభీతివల్ల గాని, పవిత్రతమీద వున్న మమకారం వల్లకానీ కాదు. అదే కారణ మయ్యుంటే ఇంత సాహసం చెయ్యగలిగేది కాదు. భర్త సమక్షంలో, తెలియనిసత్యం అతనిని పూర్తిగా పోగొట్టుకో బోతున్నపుడు తెలిసి వచ్చింది. నిద్రపోతున్న తన చైతన్యాన్ని ఆ సంఘటన కలిగించిందంతేగాని దాని ప్రభావం తనలో మార్పు తీసుక రాగలిగినంత బలవత్తరమైన దేమికాదు.

తన భ్రాంతిలోనుండి, ప్రలోభంలో నుండి మేల్కొనడానికి ఇన్నిరోజులు పట్టింది.

రిక్షా కదిలింది. అది సాగిపోతోంది. కానీ నాకా విషయం తెలియలేదు. గాడి తప్పబోతున్న నా జీవితాన్ని సరిదిద్దుకుంటున్నాను. గాఢ నిద్రనుండి మేల్కొన్న మనస్సులో నిశ్చయం జరిగిపోయింది.


'తనను ప్రేమించే భర్త, తనను విశ్వసించే భర్త. అంతకంటె ఏంకావాలి ? అతని అణువణువునా వున్న ఆప్యాయత, అనురాగం చాలవూ తన జీవితాన్ని నిశ్చింతగా గడుపుకోవడానికి !'

రిక్షా ఆగింది. ఉలిక్కిపడ్డాను.

'ఎందుకొచ్చా నిక్కడకు? ఏముందని ఇక్కడ ?' ఆపరాయిచోట ఒక్కక్షణమైనా నిలవబుద్ధి కాలేదు. గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్ళిపోవాలనిపించింది. కానీ ప్రభుదాసుకు భయపడి తిరగాల్సిన పనిలేకుండా, నిజాన్ని అతనిదగ్గర ఒప్పేసుకుని క్షమాపణ అడిగి వెళ్ళిపోవాలని నిర్ణయించుకున్నాను.

'వుండు తాతా ఇప్పుడే వస్తాను' అని చెప్పి తేలికపడిన హృదయంతో మెట్లన్నీ చకచక ఎక్కేసాను. ఆఖరు మెట్టుమీద తలెత్తి ఆగిపోయాను. తలుపుకు తాళం కప్ప వేలాడుతోంది. తలుపు సందులో నుండి చిన్నకాగితం తొంగి చూస్తోంది. ఆతృతగా విప్పి చదివాను.

'...మీరు లోకం దృష్టిలో దోషి అయితే కావచ్చు. కానీ నాకు మాత్రం దేవతవు. పాపకూపంలోకి మొదటి అడుగు వేసినప్పుడే శిక్ష మొదలవుతుంది. నా దేవతను నేనెలా శిక్షించను ? అదీగాక నాకు తెలుసు 'ఆత్మీయత ఆకర్షణను గెలుచుకుంటుందని' నాకు మీరిచ్చిన కొద్ది కాలపు వ్యవధి చాలు మీరా విషయాన్ని గ్రహించడానికి. మీరు పూర్తిగా మారిపోయి ఆ విషయం చెప్పడానికి వస్తారు. మీ నోటివెంట ఆకర్షణ ఓడిపోయిందని వినడమంత దౌర్భాగ్యం మరొకటి లేదు. ఈ ఆకర్షణను మీరు అసహ్యించుకోవడం ప్రారంభించకముందే, మీ హృదయంలో ఒకమూల ఎప్పుడో జ్ఞాపకాల ప్రవ్వకంలో జ్ఞప్తికొచ్చే మధురస్మృతిగా నన్ను మీ జీవితంలోనుండి తప్పుకోనివ్వండి. నేను కూడా మనస్ఫూర్తిగా మారిననాడు మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తాను. నాకు నమ్మకముంది ఆరోజు తప్పకుండా వస్తుందని...' కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపేసి, తొందరతొందరగా వచ్చి, రిక్షాలో



కూర్చున్నాను. నరకంలోకి తొంగిచూచి వెనక్కు పరుగెట్టేనంత హాయిగా వుంది.

నా ఇంటిదగ్గర రిక్షా ఆగినప్పుడు, నా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. మొదటి మారుగా ప్రేమమూర్తి అయిన శ్రీవారికి భయపడ్డాను. అడుగులో అడుగు వేసుకుంటూ ఆయనను సమీపించాను. లైటువేసే వుంది.

ఆయన కళ్ళుమూసుకుని వెల్లకిలా పడుకుని వున్నారు. అతనిలో ఆప్యాయత రూపంలో వున్న ఆకర్షణ దగ్గరకు రమ్మని చేతులు చాపింది. అనురాగం కట్టలు తెంచుకుంది. ఆనకట్ట వేయడం నా తరం కాకపోయింది. ఒక్క పరుగున వెళ్ళి ఆయన హృదయంపై వాలిపోయాను.

'ఈ మందిరంలో తప్ప ఇంకెక్కడ దొరుకుతుంది శాంతి నాకు!'

ఆయన నిద్రించడంలేదు. మెల్లిగా కదిలి, నన్ను రెండు చేతులతో తన గుండెలకు గాఢంగా హత్తుకున్నారు.

'ఆస్పర్శలో ఎంత హాయి వుంది. ఎంత శాంతి, సంతృప్తి వున్నాయి!' జీవితాన్నంతా గెలిచినంత ధీమా కలిగింది. ఈ విషయం తెలుసుకోవడానికి నేనెంత కాలం వ్యర్థం చేసాను?' ఆయన చేతుల్లో చాలా రోజులకు నిశ్చింతగా నిద్రపోయాను. ఆ తర్వాత...

* * *

'రాధా!' భర్త పిలుపుతో ఉలిక్కిపడి పూర్వస్మృతుల పుస్తకాన్ని మూసి; లేచింది గోపిక.

ఆనాడు వెళ్ళిన ప్రభుదాసు పదిసంవత్సరాల తర్వాత ఈనాడు వెతుక్కుంటూ వచ్చాడు. వయస్సుతో పాటు జుట్టు తెల్లబడింది, చర్మం నునుపు తగ్గింది. కానీ ఆ కళ్ళల్లో మెరుపు, పెదవులమీద చిరునవ్వు మాత్రం మాయం కాలేదు. ఆనాడు మతి పోగొట్టిన ఆకర్షణ ఈనాడేమీ చేయలేక పోతోంది. ప్రత్యేకంగా చూస్తే తప్ప అతనిలో ఆకర్షణ వున్నట్టు ఆమెకు తెలియడంలేదు. ఆరోజు అతను పారిపోయిన తర్వాత అతని తలపు ఆమెనుండి మెల్లి మెల్లిగా తప్పుకోవడం మొదలెట్టింది. అతని దూరాన్ని ఆమె మనసు, దగ్గర చేయలేక పోయింది. దగ్గరగా వున్నప్పుడు అతని కెంత దగ్గరగా పరుగెట్టేదో, అతను దూరమయ్యాక ఆమె మనస్సు అంతదూరంగాపరుగెట్టడంమొదలెట్టింది. ఆ ఆకర్షణ మధ్యన ఏమాత్రపు మమత అనే 'లింక్' వున్నా, ఆమె ఏనాటికీ అతనిని మరచి పోయేది కాదు. ఆ సత్యం ఆమె గ్రహించడానికి ఆట్టే కాలం పట్టలేదు. ఒకరోజు భర్త మెడికల్ కాన్ఫరెన్స్‌కు ఢిల్లీ వెళ్ళినప్పుడు ఆ వారం రోజులూ అతని తలపులోనే ఆమె బతికింది. అప్పు డనుకుందామె. 'ఆప్యాయత లేని ఆకర్షణ ఎంత బలహీనమైనదీ! మమత నిండిన మమకారం ఎంత బలమైనదీ!' అని. ఆమె కోరుకున్న ఆకర్షణ ఆమె భర్తలో లేకపోయినా, అతనిని సర్వశక్తులా సంతోష పెట్టింది. ఆయన బిడ్డలకు తల్లి అయింది ఆమె.

భోజనం చేస్తూ చేస్తూ తలెత్తి గోపికవైపు చూస్తూ అన్నాడు, ప్రభుదాసు, 'నేను జీవితంలో ఒక మంచి పని చేసానని ఈనాడనుకుంటున్నాను. కానీ మనస్ఫూర్తిగా ఆ నిజాన్ని నమ్మడానికి నాకు చాలా కాలమే పటి ంది గోపికా'

'కాలానికీ, పరిసరాలకూ, మీకూ కూడా నేను చాలా ఋణపడి వున్నాను మాస్టారూ!' అని 'రియాక్షన్' కొఱకు భర్తవైపు చూచింది. అతని పెదాలమీద ప్రశాంతమైన చిరునవ్వు తప్ప అనుమానపు ఛాయలే లేవు.

'ఎంత అమాయకుడు ఈయన!' అనుకుంది గోపిక, గడిచిపోయిన దాంపత్య జీవితంలో ఇలా చాలామార్లే అనుకుంది. అప్పటికీ, ఇప్పటికీ మారని ఆయనంటే ఆరాధన ఏనాటికి తగ్గుతుంది ఆమెకు!

నాలుగు రోజుల తర్వాత ప్రభుదాసును రైలెక్కించడానికి వెళ్ళినప్పుడు, అన్నారాయన.

'థాంక్స్ మాస్టారూ!'

'దేనికి? కష్టపడి మీ ఆతిథ్యాన్ని స్వీకరించినందుకా?' అని హాయిగా నవ్వాడు ప్రభుదాసు. ఒక్క క్షణం ప్రభుదాసు కళ్ళల్లోకి చూచి తల అడ్డంగా ఊపుతూ అన్నారాయన.

'కాదు మాస్టారూ, నా అదృష్టాన్ని తిరిగి మీరు భద్రంగా ఇచ్చినందుకు' అని ఆగి 'మీ త్యాగానికి వెలకట్టి నేను మీకే మివ్వగలను కృతజ్ఞతలు తప్ప' అన్నారు. ప్రభుదాసు వింతగా ఆయన కళ్ళల్లోకి చూస్తున్నాడు. గోపిక దృష్టిలో అమాయకుడైన ఆయన ప్రభుదాసుకు కొద్ది కొద్దిగా అర్థమవ సాగాడు.

'అతని మౌనంలో ఎంత తెలివి, ఔన్నత్యం వున్నాయి!'

'లేదు, లేదు. ఇందులో మీరు ప్రత్యేకంగా 'థేంక్స్' చెప్పాల్సిన అవసరం లేదు. రైలు కదిలింది.

'మామూలుగా ఏది జరుగుతుందో అదే జరిగింది. క్షణికమైన ఆకర్షణను, బలమైన ఆత్మీయత గెల్చుకుంది. అంతే... అంతే' సాగిపోయే రైలు ఆ మాటలను మోసుకుంటూ వెళ్ళిపోయింది.

(అయిపోయింది)

